# సంస్కారం




టైము పది దాటింది. టక టక మంటూ డెమ్మీ కొట్టాను. ఇంకా అవతల స్టేషనులో వ్యక్తి పలకడం

లేదు. అప్పటికే రజనుకి పైగా ఒక బొత్తి టెలి గ్రాములు కూడాయి. అవన్నీ కొట్టాలి. ఇప్పుడు స్టేషనేదీ రాక పోతే

సాయంత్రం యిదో గంట పని. సోమవారం కావడంతో పోస్టాఫీసు చాలా రద్దీగా వుంది.

అందులో పెళ్ళిళ్ళ సీజను. అన్నీ




గ్రీటింగ్ టెలిగ్రాములే!
మళ్ళీ ఒకసారి చూశాను ఆ టెలిగ్రామ్స్ వంక.

రెండు ఎక్స్ప్రైర్ టెలిగ్రాములు ఒకటి స్టార్ట్ యిమీడియట్లీ, రెండు సీరియస్ టెలిగ్రాములు.

"కలిమీ లేములు కష్ట సుఖాలు కావడి కుండలోయ్" పాట జ్ఞాపకం వచ్చింది. ఎంత నిజం వుందా రచనలో! అవతల పెళ్ళిళ్ళు, యివతల చావులు. దేవుడు కష్టసుఖాల్ని సమానంగా సృష్టించారు. టెలిగ్రాములు చూసి నాకు బాధవేసింది.

రెండూ నేనే కొట్టాలి-ఒకటి శుభం, రెండోది అశుభం. వేదాంత ధోరణిలో పడింది మనసు.

"రెండు కార్డులు యివ్వండి." కౌంటర్ దగ్గరకు ఎవరో రావడంతో మళ్ళీ మామూలు ధోరణిలోపడ్డాను.

వేదాంత ధోరణిలో కెళ్తే మనిషి మనుగడ సాగడ మెలా? అందుకే అంతరాయం. కార్డులిచ్చాను.

మళ్ళీ టెలిగ్రాముల పైపడింది నా దృష్టి. గ్రీటింగ్స్వి ఆలస్యం అయినా ఫరవాలేదు. కాని ముఖ్య మైన వార్తలవి చేరాలి!

మళ్ళీ డెమ్మీ కొట్టాను. అటు నుంచి రెస్పాన్స్ లేదు.

నా మనసు బాధతో నిండింది. మనిషికి ఎన్ని కష్టాలు!

నేను మాత్రం నాకు వేనుగా ఎన్ని కష్టాలు పడలేదు. మళ్ళీ వాటిని తల్చుకో కూడదు. ఇంకా డెమ్మీ కొడుతూనేవున్నాను.

ఇంతలో—

"ఇది ఒట్టి రంకు వంజండీ. బాబూ! దీన్ని చంపినా పరవాలేదు." ఒక బాదు బాదేడు. ఒక పెద్ద అరుపు. వెంటనే ఏడుపు.

ద్వారం ముందు చీకటి ఆవహించింది. ఏదో గలాటా! ద్వారం దగ్గిరి కెళ్ళాను.

అతనెవరో తన మనిషిని వీధికి లాగి కొడుతున్నాడు. పెద్దలు పిల్లలు కూడా మూగారు.

"అదికి అనుమానమండీ బాబూ! నే నెక్కడికీ పోలేదు. దేవుడి మీద ప్రమాణం!" అంటోంది ఏడుస్తూ.

లవకుశలో చాకలి సీను జ్ఞాపకం వచ్చింది.

"ఆ పీసు కి అడ్డుగా లేచి పొంది!" అన్నా గద్దిస్తూ.

"రంకు నేర్చినది బొంకు నేర్చదండీ?" మళ్ళీ చెయ్యెత్తాడు అతను.

"మాస్టారూ! కవర్లు కావాలి." అక్కడనుంచి వచ్చి తిరిగి యథాస్థానంలో వుండిపోయాను. కవర్లిచ్చి మళ్ళీ వీధివైపు చూసాను. వాళ్ళు వెళ్ళిపోయారు.

డెమ్మీకొడదామనుకున్నా చెయ్యి వెళ్ళలేదు. ఇందాకటి మాటలు, ఆ దృశ్యం కళ్ళకి కడుతోంది.

ఎందుకో రత్నం జ్ఞాపకానికి వచ్చింది. ఒకానొకప్పుడు నేనూ యిదే దృశ్యంలో వున్నాను. కానీ ఏదో తేడా! ఎంతో వ్యత్యాసం!

గతం కళ్ళముందు పి ని మా రీళ్ళలా తిరుగుతోంది!

అవి నాకు కొత్తగా పెళ్ళయిన రోజులు. అలాగే కొత్త వుద్యోగంలో ప్రవేశించిన రోజులు.

అది యవ్వన దశ. ఓ రోజు ఆఫీసుకొచ్చింది రత్నం. పోస్టల్లో డబ్బు వేసింది. అది వాళ్ళ అమ్మ పేర వుంది.

చూడగానే ఆకర్షించే ముఖం, చురుకైన కళ్ళు—నన్ను ఆకట్టుకున్నాయి.

కొన్నాళ్ళ చనువులో వివరాలు అడిగాను. వాళ్ళ అమ్మ వేశ్య! రత్నాన్ని కూడా ఒక వారం రోజులముందు దించిందా చీకట్లోకి.

"అంతా మా అమ్మ యిష్టం." అనే అమాయకమైన ఆ మాటలకు నా హృదయం కరిగింది.

ఒక నిశ్చయానికి వచ్చాను. మట్టిలో మాణిక్యాన్ని వెతికి తియ్యాలి. చీకటి బ్రతుకులో దీపం వెలిగించాలనుకున్నాను.

పొట్టకోసం యాంత్రిక జీవితానికి బలై వయసు నమ్ముకునే రత్నాన్ని సంస్కరించాలి, 'రత్నం' అని చాటిచెప్పాలి.

ఆ నాటినుంచి రత్నంతో పరిచయం పెంచుకున్నాను. రత్నం నా సర్వస్వం అయింది. పూర్తిగా ఆమె బాధ్యతలు స్వీకరించాను. వాళ్ళ అమ్మతో వృత్తి చెయ్యనవి దెబ్బలాడి నాతో లేచొచ్చేసింది రత్నం. నన్ను నమ్ముకున్నవాళ్ళు నా వెనక ఉన్నారన్న సంగతి మరచి నన్నే నమ్ముకున్న రత్నం సంస్కరణలో సర్వం మరచాను. ఊర్వశి వల్లో పురూరవుడు పడ్డట్టయింది నా పని.

కానీ, రత్నం తరఫు వాళ్ళంతా, నా మీద కత్తి కట్టారు.

నన్నో అర్ధరాత్రి కొట్టాలని వచ్చారు.

విషయం రత్నం ముందుగా తెల్సుకొని నన్ను వెళ్ళమంది.

"అంత పిరికివాణ్ణి కాదు. జీవితంలో మంచి చెయ్యాలనుకుంటే నీకే చేస్తాను" అన్నాను.

యీ సంగతి నన్నభిమానించే వాళ్ళకి చెప్పాను. వాళ్ళు నా వెనక వచ్చారు. రెండు వర్గాల మధ్య చిన్న యుద్ధంలాంటిది జరిగేదే కాని, వాళ్ళు వెళ్ళిపోయారు—రత్నం నాతో వుంటాననే తన నిర్ణయాన్ని గట్టిగా చెప్పడంతో.

నాపై నాకే గర్వం వేసింది. 'నాకు మరెవరూ అడ్డురారు. నా ఆశయం నెరవేరుస్తాను' అనుకున్నాను. రత్నంకి చదువు నేర్పించాను. రత్నం ఎస్సెల్సీ పాసైయింది. ఆ రోజు నా కాళ్ళపై పడి ఏడ్చింది.

"ఎక్కడ వుండవలసినదాన్ని-ఎలా చేసారు!" అంటూ హృదయం మీద వాలిపోయింది.

"ఇంకా వుంది. నీవు టీచరువి కావాలి. నలుగుర్లో తిరగాలి. చెడు బ్రతుకు బ్రతకవలసిన నువ్వు, పిల్లల్ని బాగుచేసే టీచరమ్మవి కావాలి. అదే నా ఆశయం. అందుకు ఎంత ఖర్చు అయినా భరిస్తాను." నా మాటల్లో నాకు తెలియని దీక్ష, పట్టుదల, దృఢ విశ్వాసము గోచరించాయి.

"ఇప్పటికే ఎంతో ఖర్చు చేసారు?"

"ఎంత ఖర్చయినా ఫరవాలేదు నే భరిస్తాను. నువ్వు మాత్రం నా ఆశని వమ్ము చెయ్యకుండా చదవాలి" అన్నాను.

తరువాత టీచరు ట్రయినింగ్‌కి బండెక్కించాను.

ఏదో రోజు రత్నం పేరు సార్థకం చేసుకుంటుందని నా విశ్వాసం. కాని, వేరొకప్రక్క ఎవరికో లోటు చేస్తున్నాను అని అంతరాత్మ ఘోషించింది.

పెళ్ళాం, పిల్లల్ని చూడ్డంలేదనే లోకం అరుపులు, ఇంట్లోవాళ్ళ ఏడుపులు—అన్నీ భరించాను. నా ఆశయం నెరవేరాలి!

"నన్ను యింతగా మార్చిన మీ దగ్గరే నా జీవితం వెళ్ళిపోవాలి! మీ హృదయంలోనే నాకు స్థానం కావాలి!" ట్రయినింగుకు వెళ్తూ రత్నం ఏడుస్తూ నా గుండెలపై వాలి అన్నమాటలు.

"అలాగేలే" అన్నాను అనునయిస్తూ.

కాని యిదెలా సాధ్యం? ఒక వరలో రెండు కత్తులెలా యిముడుతాయి? ఇప్పటికే నా ప్రవర్తన గుప్పుమంది. మామగారి వరకూ వెళ్ళింది యీ గాలీ వాన. వెంటనే ఆయన కోపంతో వచ్చారు.

"అల్లుడూ! నీ ప్రవర్తన బాగు లేదు. లోకం కోడై కూస్తోంది. నా కూతురూ, పిల్లల గతేం కాను?"

"మీ అమ్మాయి విషయంలో మీకేం భయం లేదు. నాది పూచీ. చూడండి! చిన్నప్పుడు పిల్లలు ఏది పట్టుకుంటే అది వదలరు. నాదీ అలాంటి మనస్తత్వమే. ఏదో ఆశయం పెట్టుకున్నాను. అది నెరవేరాలి. అంతే!"

"నువ్వు అనవసర శ్రమ తీసుకుంటున్నావు. ఉల్లి మల్లి కాదు."

"కాళ్ళతో తొక్కి నోటితో ఉమ్మేసి మనిషి ఎంతగానో పాడు చేస్తున్న మట్టి-అదే మనిషి చేతిలో అందమైన పాత్రలుగా రూపు దాల్చడం లేదా? వాటినే ఆ మనిషి వాడుకోవడం లేదా? మట్టికే ఆ రూపొచ్చినపుడు మనిషి ఎందుకు మారదు?" అన్నాను ఆవేశంగా.

అతను మాట్లాడలేదు కాని, అప్పటి నుంచి వాళ్ళమ్మాయి బాధ్యత తను చేపట్టాడు. నాకు కొంత బాధ్యత తగ్గిందనుకున్నాను.

రత్నంని చూడకుండా ఉండలేక పోయేవాణ్ణి. రత్నం వెళుతూ అన్న మాటలు ఏవో ఆశలు రేపాయి. అవి పెరిగాయి. నెలకోసారి వెళ్ళి కల్సుకునే వాణ్ణి. కావలసిన డబ్బు యిచ్చేవాణ్ణి.

టీచరు ట్రయినింగుపాసయింది. రత్నంని టీచరుగా నాకు దూరంగా వేసారు.

నా మనసు బాధతో నిండింది. కానీ రత్నం వృద్ధిలోకి రావడంతో సంతోషించాను. రేపు నలుగుర్లో వ్యక్తిత్వంతో మసలే రత్నం.... రత్నంని విడువలేని పరిస్థితి.

రెండు మూడు నెలలు పరిస్థితుల వల్ల రత్నం దగ్గరికి వెళ్ళ లేదు.

"రత్నం ఎవర్నో మరిగింది!" ఒకళ్ళిద్దరు నాతో వచ్చి అన్నారు.

ఆశనిపాతంలాంటి ఆ వార్త నేను విని తట్టుకోలేక పోయాను. నాతో అన్న మాటలు, నాపై ప్రేమ, యిన్నాళ్ళ కలయిక-బూటకమా?

ఆ మాటలతో నే నల్లుకున్న గూడు, నే పడ్డ శ్రమ .... వికల మనస్కుణ్ణయినాను.

నిజానిజాలు తెల్సుకోవాలి! అందుకే వెళ్ళాను.

సంస్కరించడం ఎంత కష్టం! పాడు చెయ్యడం ఎంత సులువు!

---


## విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 18 రూ॥ |
| విడి ప్రతి | 3 రూ॥ |

కొన్ని సంవత్సరాల నా కృషి, ఒక నెలలో మళ్ళీ బూడిదలో పోయింది. అతను ఎర్రగా బుర్రగా వున్నాడు. పై మెరుగులకి భ్రమ పింది. అతన్ని నమ్మి మోస పోయింది. వృత్తికి కూడా లొంగిం చేదు. ఉద్యోగం చేయిస్తున్నాడు. రెండిటి డబ్బుతో సుఖపడు తున్నాడు.

"లోపలికి రండి!" అనే రత్నం మాట నాకు వినిపించ లేదు. అసహ్యం వేసి వెను తిరిగాను.

మసిపట్టిన మనసుని తుడిచే సాను. నాభార్య రూపం నిర్మలమైన అద్దం లాంటి నా మనసులో ప్రతి ష్టించాను. మళ్ళీ సంసార గాడిలో పడ్డాను.

"రెండు రెవెన్యూ స్టాంపు లివ్వండి." కౌంటరు మీద డబ్బులు కొట్టి అడగడంతో యీ లోకం లోకి వచ్చాను. ఇస్తూ రోడ్డు పైకి చూసాను. ఏదో రిక్షా ఆగింది. రత్నం రూపంలా అనిపించింది. నిజం-రత్నమే! నిశ్చేష్టుణ్ణయ్యాను. ఆ రూపం పోయింది. మనిషి చాలా పాడై యింది.

"బాగున్నారా?" వచ్చి బల్ల మీద కూర్చుంటూ అడిగింది.

"ఆఁ!" ఆశ్చర్యం నుంచి తేరుకున్నాను. "నా జీతం ఆరొం దలికి పెరిగింది. ఇప్పుడు యిల్లు కట్టుకున్నాము."

"సంతోషం! కానీ రత్నం! నీ రూపాన్నీ, నిన్నూ ఏనాడో మరచి పోయాను. నువ్వే ముఖం పెట్టు కొని వచ్చావు? యివన్నీ ఎందుకు చెప్తున్నావు? మానిపోయిన గాయాన్ని మళ్ళీ రేపకు! నా బ్రతుకు నన్ను బ్రతకనీ. వెళ్ళు-మరి రాకు!"

చిన్న ముఖం చేసుకొని వెను దిరిగింది.

"నిన్ను సంస్కరించాలను కున్నాను. సంస్కరించాను. కాని నీ బుద్ధిని సంస్కరించాలని అనుకో లేదు. అందుకే సంస్కరించలేక పోయాను. బుద్ధి కుక్క తోక లాంటిది. ఎంత తిన్నబరుద్దామన్నా మళ్ళీ వెనకటికే వస్తుంది!' నాలో నేను అనుకున్నాను.

అచేతనంగా నా చేతులు డెస్కీ కొట్టాయి. పలకలేదు.

లైను పోయింది.

'ఏమో! రత్నాన్ని చదివించటం వల్లనే, ఆమె మనిషై, నేను నా భార్యని సరిగ్గా చూడటం లేదని తెలుసుకుని, నన్ను మనిషిని చేసే ప్రయత్నంలో ఆమె అలా అయిం దేమో!' అన్న ఆలోచన మెరుపులా వచ్చింది.

చేతులుఅచేతనంగా పనిజేశాయి. డెస్కీ కొట్టాను. పోయిన లైను వచ్చింది.

రత్నం నిజంగా రత్నం అని పిస్తోంది మనస్సులో. •